క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలంటూ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఈమేరకు శనివారం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలన్నారు. కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన, వసతులు, తదితర అంశాలను వివరించారు. త్వరలోనే పీజీ తరగతులు, ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఓం ప్రకాష్ జాదవ్, కోసారి సంతోష్ కుమార్, రామ్మోహన్, రాజయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు స్వీకరిస్తున్న డీటీ నరేశ్‌గౌడ్

కుంటాల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పథకంతో రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించవచ్చని డీటీ నరేశ్ గౌడ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో శనివారం రైతుల నుంచి 28 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలోఆర్‌ఐలు ఆడెల్లు, రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, జూనియర్ అసిస్టెంట్ విశాల్, సాగర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

కుంటాల: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు తప్పవని ఎస్సై సి. అశోక్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కుంటాల బస్టాండ్ ప్రాంతంలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై దేవన్న, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్సై సుప్రియ హెచ్చరించారు. శనివారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ఒక వేళ వాహనాలు ఇచ్చిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

కడెం: బీజేపీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు ధర్మపురి తిరుపతి, కల్లెం రమణారెడ్డి, ముల్కి క్రిష్ణ, నరేందుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా రాపర్తి శ్రీనివాస్, పూస శ్రీరాం, కార్యదర్శులుగా సత్తెన్న, నర్సయ్య, గట్ల నర్సయ్య, భీమన్న, కోశాధికారిగా పాలకుర్తి నగేశ్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొత్త స్తంభాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాబాల్లో మద్యం విక్రయించొద్దు



తనిఖీలు చేస్తున్న ఎస్సై

భైంసాటౌన్: దాబాల్లో మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని పట్టణ ఎస్సై మహ్మద్ గౌసుద్దీన్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పలు దాబాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దాబాల్లోని మద్యం నిల్వలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం



స్వామివారి విగ్రహం

- నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు
- సోమవారం కల్యాణం
- భారీగా తరలిరానున్న భక్తజనం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర అటవీ ప్రాంతంలో వెలిసిన ప్రాచీన ఆలయమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ప్రతీఏటా వైశాఖ మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది సైతం బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారిని ఊరేగించేందుకు ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని సిద్ధం చేశారు. ఆలయ కోనేటి వద్ద పరిసరాలను శుభ్రం చేసి భక్తులకు ఎలాంటి ఇక్కట్లు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం స్థాపనము, నృసింహ జయంతితో ఈఉత్సవాలు ప్రారంభించడం జరుగుతుందని వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి, శ్రీమాన్ వాసుదేవచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ అంగూరి మహేందర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్ తెలిపారు. అలాగే స్వామివార్ల కల్యాణ మహోత్సవానికి సైతం కల్యాణం మండపం సిద్ధం చేస్తున్నారు.

పూజ కార్యక్రమాలు..

ఆదివారం సాయంత్రం స్వస్తివాచన, సకల దేవతా స్థాపనమే, అంకురారోహణం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సోమవారం ఉదయం నిత్యార్చన, అగ్ని ప్రతిష్ట, యజ్ఞం, ధ్వజారోహన, బలిహరణము, గరుడ ముద్దల అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఈనెల 13 నుంచి నిత్యాపూజా కార్యక్రమంలో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 14న స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉదయం నిత్యార్చన, తీర్థప్రసాద వితరణ, సామూహిక నవగ్రహ పూజ, సాయంత్రం హవణము, బలిహరణం భేరీ పూజ నిర్వహించడం జరుగుందని, 15న నిత్యపూజలతో పాటు పర్వతారోహనము, దీపారాధన, నివేదనలు, 16న నిత్యార్చన, హోమం, బలిహరణము, పుష్కరిణిలో చక్రతీర్థ, 17న తెల్లవారు జామున స్వామివారి నాగవెళ్లి కార్యక్రమం, 18న స్వామివారి రథోత్సవం, 19న నిత్యపూజా కార్యక్రమాలు, ఈనెల 20న మారువెళ్లి స్వామివారి సేవ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పండితులు పేర్కొన్నారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



బుధవారం నుంచి శ్రీకాల్వ నరసింహ స్వామివారి ఆలయంలో జరిగే బహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల 11 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈసారి ఆలయ ప్రాంగణంలో నూతన కల్యాణ మండపాన్ని నిర్మించాం.

– అంగూరి మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్

తాగునీటికి తప్పని తిప్పలు



భగీరథ సిబ్బందిని నిలదీస్తున్న గ్రామస్తులు



కాలిపోయిన మోటర్‌ను చూపిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని గంగాయిపేట గ్రామానికి చెందిన గిరిజనులు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రీడ్, ఇంట్రా ద్వారా నీరు రాకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం. గ్రామంలోని మోటర్ 20 రోజుల క్రితం కాలిపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీంతో వ్యవసాయ బావుల నుంచి మూడు నెలలుగా నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలో చేతిపంపు ఉన్నప్పటికీ కలుషిత నీరు రావడంతో అవి తాగేందుకు పనికి రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 20కి పైగా కుటుంబాలు ఉన్నా.. ఒక ఇంటికే కొద్దిపాటి మిషన్ భగీరథ నీరు వస్తుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరా లైన్‌మెన్ అరవింద్‌ను గ్రామస్తులు, మాజీ సర్పంచ్ మహేందర్ నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి మిషన్ భగీరథ నీటిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్ కాలనీలోని శ్రీలలిత పరమేశ్వరి అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పదోవ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నిమ్మగడ్డ శరత్‌చంద్ర శర్మ, నర్రా నితీష్, జగన్నాథం విజయ్ వైదిక బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చన, గణపతి, గౌరీ పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతితో పాటు రాత్రికి అయ్యప్పస్వామి పదునెట్టంబడి (పడి)పూజను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, కొత్తపల్లి సురేశ్, భక్తులు పాల్గొన్నారు.

నేడు నృసింహ జయంతి

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహనగర్‌లోగల శ్రీ నృసింహ స్వామి ఆలయంలో ఆదివారం నృసింహ జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఏటా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి ఆలయంలో భజన కార్యక్రమం ఉంటుందని, సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ ఉంటుందన్నారు.

నేడు మాతృదినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కలంస్నేహం, స్వరస్నేహం సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించనున్నట్లు సంస్థల సమన్వయకర్తలు కడారి దశరథ్, కొండూరు పోతన్న తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మాతృమూర్తులకు పాదపూజ ఉంటుందని, జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ అభిమానులు హాజరుకావాలని కోరారు.

రామచందర్ అడుగుజాడల్లో నడవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: యువత రామచందర్ చూపిన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఆదివాసీ ఉద్యమానికి నిస్వార్థంగా సేవ చేసిన మద్ది రామచందర్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన మహాత్ముడని కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి అనుకొండ సత్యనారాయణ, దాసరి రమేశ్, కస్తూరి భీమేశ్వర్, కాలశంకర్, చుంచు పోశెట్టి, అర్జున్, లింగన్న, బాబయ్య పాల్గొన్నారు.

నాణ్యతను పర్యవేక్షించాలి

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె, గోడలపంపు, దిలావర్‌పూర్, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల చేపట్టిన సీసీరోడ్డు పనుల్లో నాణ్యత అధికారులు పర్యవేక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి కోరారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా రోడ్లు వేశారని ఆరోపించారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పనుల్లో నాణ్యత విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగురాలి వివాహానికి చేయూత



పుస్తె, మట్టెలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన అనాథ యువతి వివాహానికి ఓకేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. యువతి తండ్రి చిన్నప్పుడే మృతి చెందగా.. తల్లి ఏడాది క్రితం చనిపోయింది. దీంతో మేనత్త సంరక్షణలో ఉన్న యువతి మమతకు ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఈ విషయమై స్థానికులు ఖానాపూర్ వాసి ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కష్ణంరాజును సంప్రదించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతి వివాహానికి శనివారం పుస్తె, మట్టెలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలాచారి జన్మదిన వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద కేక్ కట్ చేశారు. వివేకానంద అనాథ పిల్లల ఆవాసంలో రూ.3100 విరాళం అందజేశారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి గాయాలు

నర్సాపూర్ (జి): గొల్లమాడ గ్రామ శివారులో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూరుగుపల్లి (జి) గ్రామానికి చెందిన జాదవ్ మంగీలాల్ పని నిమిత్తం గొల్లమాడ గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన జాదవ్ శ్రీనివాస్ గొల్లమాడ నుంచి బూరుగుపల్లి(జి) వెళ్తుండగా.. మార్గమధ్యలో గొల్లమాడ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న మంగీలాల్ బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో జాదవ్ మంగీలాల్‌కు గాయాలయ్యాయి. మంగీలాల్ మామ రాథోడ్ వసంత్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లాప్‌టాప్ అప్పగింత



కుటుంబసభ్యులకు అందజేస్తున్న కండక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నుంచి శంషాబాద్ వెళ్లే రాజధాని ఏసీ బస్సులో శుక్రవారం సౌదీ కంపెనీకి చెందిన లాప్‌టాప్‌ను మరిచిపోయి ఫ్లైట్ ఎక్కి సౌదీ అరేబియా వెళ్లిపోయాడు. రిజర్వేషన్ చార్ట్ ఆధారంగా ప్రయాణికుడు ఆర్మూర్‌కు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించి ఫోన్ నంబర్ ఆధారంగా తిరుగు ప్రయాణంలో ఆర్మూర్ బస్టాండ్‌లో స్టేషన్ మేనేజర్ నారాయణ, గోపి సమక్షంలో ప్రయాణికుడి కుటుంబసభ్యులకు శనివారం లాప్‌టాప్ అందజేసి కండక్టర్ ఉదయ్ నిజాయతీని చాటుకున్నారు. సందర్భంగా కండక్టర్ ఉదయ్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



నివాళులర్పిస్తున్న మండలవాసులు

కడెం: భారత్–పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించారు. మరళీనాయక్ అమర్ రహే.. పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హపవత్ రాజేందర్, రాజేశ్‌నాయక్, కిషన్ నాయక్, రమేశ్, సురేశ్, ప్రసాద్, తారసింగ్, వినయ్ పాల్గొన్నారు.

సారంగపూర్: వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పార్టీలకు అతీతంగా నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు నామల వీరయ్య, భీమలింగం, ఇర్గదిండ్ల సత్య, కుర్ర నవీన్, దేవన్న, సుధాకర్, సాయన్న, భోజన్న పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని అష్టా గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. భారత ప్రభుత్వం ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, వీర మరణం పొందిన జవానుకు శాంతి కలగాలని నినాదాలు చేశారు. విద్యార్థులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్‌కు ఆయన నివాసంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. భారత సైన్యం దేశం గర్వపడేలా చేసిందని, నిజమైన హీరోలకు సెల్యూట్ అంటూ సైనిక చర్యను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, ధర్మాజీ రాజేందర్, మూడుసు సత్యనారాయణ, అనుముల భాస్కర్, పూదరి సాయికష్ణ, నాలం శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, కూన చందు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మల్లేశ్వర్‌రావు



అవగాహన కల్పిస్తున్న క్లస్టర్ అధికారి యోగేశ్

లోకేశ్వరం: రైతులు వ్యవసాయంతో పాటు ఆయిల్ పాం సాగుపై దృష్టిని సారించాలని ప్రియునిక్ ఇండియా కంపెనీ డీజీఎం మల్లేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పంచగుడి గ్రామంలోని ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి ఆయిల్‌పాం తోటలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం ఒక టన్నుకు రూ.21 వేలు పలుకుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీ రైతులకు 90 శాతం రాయితీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, వెంకట్‌రెడ్డి, రాజారం, దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో శనివారం అయిల్‌పాం సాగు చేసిన రైతులకు క్లస్టర్ అధికారి యోగశ్ అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడి సాధించడం గురించి వివరించారు. పంట టన్ను ధర రూ. 21 వేలు ఉందన్నారు. కొత్తగా పంట సాగు చేసేందుకు రైతులకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ, గంగాధర్ పటేల్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ



శోభాయాత్రలో పాల్గొన్న స్వాములు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో హనుమాన్ దీక్షా సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం నగర కీర్తన నిర్వహించారు. హనుమాన్ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని స్థానిక రోకడ్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అంజన్నకు అభిషేకం, అలంకరణ, మహాహారతి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి శ్రీరాముడు, హనుమాన్, గణపతి చిత్రపటాలతో కిసాన్‌గల్లి, నేతాజీనగర్ కాలనీల్లోని వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు.

ప్రతీ పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న సంజయ్ కుమార్

కుంటాల: ప్రతీ పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తామని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మేలుకొలుపు రథయాత్ర శనివారం కుంటాకు చేరుకుంది. బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రథయాత్రలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. 78 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న మండల కమీషన్‌ను తుంగలో తొక్కారని ఆరోపించారు. బీసీలంతా హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్, అప్క గజేందర్ యాదవ్, సుంకెట పోశెట్టి, మాచర్ల శ్రీనివాస్, నామని అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. బీసీ మేలుకొలుపు యాత్ర శనివారం మండల కేంద్రానికి చేరుకుంది.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

లక్ష్మణచాంద: కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్ మాతృ మూర్తి ముత్తవ్వ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం కనకాపూర్‌లోని రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అల్లోల సురేందర్ రెడ్డి, రాజు, శ్రీకాంత్ యాదవ్, సత్యనారాయణ, పాకాల రామచందర్ పాల్గొన్నారు.

ఓంకార్ శత జయంతి సభకు తరలిరండి

ఖానాపూర్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ కోరారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లో ఓంకార్ స్మారక స్థూపం పునఃప్రారంభం అవుతుందన్నారు. సమావేశంలో నాయకులు రమేశ్, రాజన్న పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

తానూరు: మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి మద్యం 100కు పదే పదే డయల్ చేసి పోలీసుల విధులకు ఆటకం కలిగించినందుకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైనట్లు ట్రైయినీ ఎస్సై నవనిత్ రెడ్డి తెలిపారు. అపదలో ఉన్న, అత్యవసర పరిస్థితిలో మాత్రమే వినియోగించుకోవాలన్నారు. పోలీసుల విధులకు అటకం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.